

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

గంజాయి, మత్తు రహిత జిల్లాగా మారుద్దాం

- ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి
- సిద్దిపేట సీపీ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, జనవరి 31: గంజాయి, ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై విధులు నిర్వర్తించాలని పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. బుధవారం ఆమె సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, ఉమెన్ పోలీస్‌స్టేషన్, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్, పోలీస్ క్యాంటీన్‌ను సందర్శించి మాట్లాడారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని చెప్పారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రధాన చౌరస్తాలలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలపై స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పట్టణంలో చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై త్వరగా స్పందించి ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని స్పష్టం చేశారు. ఆమె వెంట వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, వెల్ఫేర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ధరణికుమార్, ఎస్‌ఐలు నర్సిం గ్‌రావు, రంజిత్‌రెడ్డి, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు నేటితో ముగియనున్నది. సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు కొలువుదీరి ఐదేళ్లు పూర్తవడంతో తక్షణమే గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సర్పంచుల స్థానంలో మండల, డివిజన్‌స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఏ గ్రామానికి ఏయే అధికారిని నియమిస్తున్నారనే తుది జాబితా కూడా సిద్ధమైంది.

నేటితో పంచాయతీ పాలకవర్గాల గడువు పూర్తి

- మండల కేంద్రాలు, మేజర్ గ్రామాలకు కీలక అధికారులు
- పంచాయతీ సెక్రటరీకి మళ్లీ జాయింట్ చెక్‌పవర్
- తుదిజాబితా సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం

ఇక ప్రత్యేక పాలన

ఆంధ్రజ్యోతిప్రతినిధి, సిద్దిపేట, జనవరి 31: సిద్దిపేట జిల్లాలోని 26 మండలాల్లో 499 గ్రామపంచాయతీలున్నాయి. 2019 జనవరిలో మూడు దశలుగా ఈ గ్రామాలకు ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 1వ తేదీతో ఈ పాలకవర్గాల గడువు పూర్తికానున్నది. అయితే, ఇప్పట్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించే పరిస్థితి లేదనే దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకాధికారులను నియమిస్తున్నారు. సర్పంచ్‌ల స్థానాల్లో ఇకపై ప్రభుత్వ అధికారులు పాలన సాగించనున్నారు.

ఆ గ్రామాలకు పెద్దసార్లు

జిల్లావ్యాప్తంగా 499 గ్రామపంచాయతీలు ఉన్నప్పటికీ ప్రధానంగా 100 గ్రామాలను ప్రత్యేక కోటాలో గుర్తించినట్లు తెలుస్తున్నది. ఇందులో మండల కేంద్రాలు, మేజర్ గ్రామాలు, ఇతర ప్రత్యేకతలున్న గ్రామాలుంటాయి. వీటికి స్పెషలాఫీసర్లుగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, డీఈలు, ఏడీఏలు వ్యవహరిస్తారు. వివిధ విభాగాల ఏఈలు, మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, వెటర్నరీ అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, తదితర అధికారులంతా ఇతర గ్రామాల ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టేలా జాబితా సిద్ధం చేశారు. నేడు లేదా రేపు వీరు సర్పంచుల నుంచి రికార్డులను స్వాధీనం చేసుకుంటారు. ఇక పంచాయతీ ఎన్నికలు జరిగేదాకా ఆ స్థానాల్లో కొనసాగనున్నారు.



చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

కార్యదర్శే కథానాయకుడు

ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులే కీలకం కానున్నారు. ప్రస్తుతం గ్రామాలను అదనపు బాధ్యతగానే అధికారులకు అప్పగించారు. దీంతో పూర్తి సమయాన్ని గ్రామాలకు కేటాయించలేకపోతారు. అందుకే నిరంతరం అందుబాటులో ఉండేలా పంచాయతీ కార్యదర్శులకు తగిన సూచనలిచ్చారు. సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ కార్యదర్శులకు జాయింట్ చెక్‌పవర్‌ను కల్పించారు. ఇప్పటివరకు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు కలిపి జాయింట్ చెక్‌పవర్ ఉండగా ఇకపై ప్రత్యేకాధికారులు, కార్యదర్శులకు కలిపి నిధులను డ్రా చేసే అధికారం ఇచ్చారు. ఆయా గ్రామాలపై కార్యదర్శులకు పూర్తి పట్టు ఉండడంతో సమస్యలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో వీరి పాత్ర కీలకం కాబోతున్నది. తాజా పరిణామాలతో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేనందున కార్యదర్శులే అంతా తామై వ్యవహరించనున్నారు.

సర్పంచుల గగ్గోలు

పంచాయతీ ఎన్నికలు జరిగే దాకా తమనే కొనసాగించాలని ప్రస్తుత సర్పంచులు, ఉపసర్పంచులు ప్రభుత్వాన్ని కోరారు. కానీ సర్కారు మాత్రం ప్రత్యేకాధికారుల పాలన వైపే మొగ్గుచూపింది. దీంతో సర్పంచ్‌ల ఆశలు ఆవిరయ్యాయి. గడిచిన ఐదేళ్లలో మొదటి ఏడాది పాలనాపరమైన విషయాలపై అవగాహన పొందడానికే సమయం గడిచిందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇక వరుసగా రెండేళ్లు కరోనా కారణంగా ఇబ్బందిపడ్డామని, ఆ తర్వాత నిధుల కొరతతో ఆశించిన స్థాయిలో పనులు చేయలేకపోయామని, చేసిన పనులకు కూడా బిల్లులు రాలేదని సర్పంచులు ఆవేదన చెందుతున్నారు. కనీసం పెండింగ్‌లో ఉన్న బిల్లులకు సంబంధించిన సొమ్మును విడుదల చేయాలని కోరుతున్నారు.

నెరవేరని 'ఏకగ్రీవ' ఫలితం

సర్పంచ్‌తోపాటు వార్డుసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ప్రోత్సాహకంగా రూ.10లక్షల నగదును ఆయా గ్రామాలకు మంజూరు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. ఏకగ్రీవం కావడం వల్ల ఎన్నికల ఖర్చు మిగులుతుందని, అదే విధంగా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటవచ్చనే సంకేతాలతో సిద్దిపేట జిల్లాలోని 48 గ్రామాలు ఈ దిశగా ముందడుగు వేశాయి. మరికొన్ని చోట్ల కేవలం సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే ఏకగ్రీవంగా ఎన్నికైన ఆరునెలల వ్యవధిలోనే రూ.10లక్షల ప్రోత్సాహక నజరానను ఆయా పంచాయతీ ఖాతాలో జమ చేయాలి. ఈ నిధులను గ్రామానికి సంబంధించి ఏ అవసరానికైనా ఖర్చు చేసే అధికారం పాలకవర్గానికి ఉంటుంది. ఐదేళ్లు గడిచినా ఏకగ్రీవ నగదు మాత్రం గ్రామాలకు అందలేదు. పలుమార్లు ఈగ్రామాల పాలకవర్గాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.

అసంతృప్తితో వైదొలుగుతున్నాం

- రాయపోల్ మండల సర్పంచులు

రాయపోల్, జనవరి 31: "చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక అప్పుల పాలయ్యాం. అసంతృప్తితో పదవి నుంచి వైదొలుగుతున్నాం" అంటూ రాయపోల్ మండల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీపీ అనితాశ్రీనివాస్ ఆధ్వర్యంలో రాయపోల్ మండల సర్పంచులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సర్పంచులకు శాలువాలు కప్పి పూలదండలు వేసి మెమొంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు మాట్లాడారు. తమ మెడపై కత్తి పెట్టి పనులు చేయించారని, చేసిన అభివృద్ధి పనులకు లక్షలాది రూపాయల బిల్లులు రావాల్సి ఉన్నదని పేర్కొన్నారు. వాటిని ఇప్పించేలా అధికారులు చొరవ చూపాలని కోరారు. రాబోయే సర్పంచులకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని వారు అభిప్రాయపడ్డారు. ఏకగ్రీవ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పంచాయతీలకు వచ్చే నిధులు సరిపడక.. ఆశించిన అభివృద్ధి పనులు చేయలేకపోయామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మునయ్య, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకటనరసింహారెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు పర్వేజ్, ఎంపీవో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

పౌష్టికాహారంతో ఆరోగ్యవంత సమాజం

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

చేర్యాల, జనవరి 31: భవిష్యత్ తరాలు బాగుండాలంటే ఆహారం బలవర్థకంగా ఉండాలని, అందుకు విధిగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. కొమురవెల్లి మండలం గౌరాయపల్లిలో బుధ వారం పోషకాహార విలువలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కుటుంబ బాధ్యతలలో తలమునకలైన మహిళలు ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. రక్తహీనత నివారించుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతాన్ని విధిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని వననర్సరీ, డంపింగ్‌యార్డును పరిశీలించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధనపై ఆరాతీశారు. ఆయా కార్యక్రమంలో ఎంపీడీవో కేవీఎల్ అనూరాధ, సీడీపీవో శారద, సర్పంచు కృష్ణారెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు అంశాలపై కౌన్సిల్‌లో పట్టు

- వాడీవేడిగా సమావేశం
- పలు సమస్యలను విన్నవించిన సభ్యులు

సిద్దిపేట టౌన్, జనవరి 31 : సిద్దిపేట పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు స్పష్టం చేశారు. బుధవారం మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని కార్యాలయంలో నిర్వహించారు. ప్రధానంగా మూడు అంశాలతో పాటు పలు అంశాలపై వాడీవేడిగా సమావేశం కొనసాగింది. కౌన్సిలర్లు బ్రహ్మం, ఉదర జయవెంకట్‌రెడ్డి, నాయకం లక్ష్మణ్, ఆనగోని వినోద్‌గౌడ్, సాయి ఈశ్వర్‌గౌడ్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలకు సంబంధించి వాటి మరమ్మతులకు రూ.3.08 కోట్ల మేర మున్సిపల్ నిధులను కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను పౌలోమి ఏజెన్సీ నిర్మించిందని, నిర్వహణ కూడా వారికే అప్పగించాలని సూచించారు. మరమ్మతులకు కేటాయించిన నిధులను వార్డుల అభివృద్ధికి ఖర్చు చేయాలని వారు డిమాండ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనితను బదిలీ చేయాలన్నారు. పట్టణ శివారులో ఎస్‌టీపీ వద్ద అఖిల్ అనే వ్యక్తికి చెందిన భూమి అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీలో కోల్పోయినందున, అఖిల్‌కు తిరిగి భూమిని కొనుగోలు చేసి ఇవ్వాలని ఎజెండాలో ప్రతిపాదనలు చేశారు. అయితే అఖిల్‌కు భూమి కోల్పోలేదని, దానిని రీ సర్వే చేయించాలని సభ్యులు డిమాండ్ చేస్తూ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణంలో తన భూమి కూడా పోయిందని, అఖిల్‌కు ఇస్తే తనకూ భూమి కొనుగోలు చేసి ఇవ్వాలని కౌన్సిలర్ ఉదర జయవెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇక మున్సిపల్ కౌన్సిల్‌కు సంబంధించి గత నెల ఆమోదించిన ఎజెండాను మినిట్స్ బుక్‌లో నమోదు చేయకపోవడం, రిజిస్టర్‌లో కౌన్సిల్ సభ్యుల సంతకాలు తీసుకోకపోవడంతో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను విన్నవించారు. వీటిపై స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆయాశాఖల అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, సిద్దిపేట మున్సిపాలిటీ డీఈ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు

ప్రారంభించలేదా.. ఆపేయండి!

- ఎస్‌డీఎఫ్ పనులపై ఆదేశాలు
- అసంపూర్తిగా ఉంటే పూర్తి చేయండి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, జనవరి 31 : ముఖ్యమంత్రి మంజూరు చేసిన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్)పనులను ప్రారంభించకపోతే వెంటనే ఆపేయాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం మౌఖిక ఆదేశాలిచ్చింది. 2022 ఫిబ్రవరిలో నారాయణఖేడ్‌లో జరిగిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోత పథకం పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో అభివృద్ధి పనులకు ఎస్‌డీఎఫ్ ద్వారా నిధులను ప్రకటించారు. సంగారెడ్డి, జహీరాబాద్ మున్సిపాలిటీలకు రూ.50 కోట్ల చొప్పున, మిగిలిన మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున, గ్రామపంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేశారు. సభ తర్వాత రెండు నెలలకు జిల్లాకు ఈ మేరకు ఎస్‌డీఎఫ్ నుంచి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీలకు రూ.2.50 కోట్లు 647 గ్రామపంచాయతీలకు రూ.129.40 కోట్లను మంజూరయ్యాయి. ఈ నిధులతో మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, కల్వర్టులు తదితర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉన్నది. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పనుల గుర్తింపు, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులను అదే ఏడాది జూన్, జూలై నెలలో ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం నెలకొనడంతో ఈ ప్రభావం ఇతర పనులపై పడింది. చాలా ప్రాంతాల్లో పనులను చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దాంతో మంజూరైన పనులు వందల సంఖ్యలో మొదలు కాలేదు. ఈలోగా అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ మొదలవడంతో అధికార యంత్రాంగం దృష్టి సారించలేకపోయింది. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగా ఎస్‌డీఎఫ్ ద్వారా నిధుల మంజూరు, పనుల గురించి ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించినట్టు తెలిసింది. ఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరై పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించాలని, ఎక్కడైనా అసంపూర్తిగా ఉంటే పూర్తి చేయించాలని సీఎం ఆదేశించినట్టు సమాచారం. అదే సమయంలో అసలే ప్రారంభించని పనులు ఉంటే వాటిని నిలిపివేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు మౌఖికంగా ఆదేశాలు అందినట్టు తెలిసింది.



ప్రజాగాయకుడు గద్దర్ 76వ జయంతిని పురస్కరించుకుని రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆయన విగ్రహాన్ని బుధవారం రాత్రి ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రొఫెసర్ కంచె అయిలయ్య, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గద్దర్ కుమార్తె వెన్నెల, కుమారుడు సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

- రామచంద్రాపురం, జనవరి 31





చేర్యాల కస్తూర్బాలో వంతులవారీగా స్నానాలు!

- బోరు ఉన్నప్పటికీ సరిపడని నీరు
- ట్యాంకర్ ద్వారా తెప్పించినా లోపలికి మోయాల్సిందే
- విద్యార్థినులకు తప్పని ఇబ్బందులు

చేర్యాల, జనవరి 31: విద్యార్థులు చదువులో రాణించాలంటే సమయానికి భోజనం, విశ్రాంతితో పాటు సరైన వసతులు ఉండాలి. అయితే, చేర్యాలలోని కస్తూర్బా విద్యార్థినుల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఈ పాఠశాల విద్యార్థినులు సుమారు వారం రోజులుగా వంతులవారీగా స్నానాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం.

పాఠశాలలో మొత్తం 250 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వారి అవసరాల దృష్ట్యా బోరు ఉన్నప్పటికీ నీరు సరిపోవడం లేదు. జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పట్టణ శివారులోని ఐవోసీ పెట్రోల్ పంపు సమీపంలో మిషన్‌భగీరథ పైప్‌లైన్‌ను సవరిస్తున్నారు. దీంతో పట్టణానికి మిషన్ భగీరథ నీటిసరఫరా నిలిచిపోయింది. కస్తూర్బా పాఠశాలకూ సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థినులు వంతుల వారీగా స్నానా లు చేస్తున్నారు. అయితే పాఠశాల పక్క భవనంలోనే మున్సిపల్ కార్యాలయం ఉంది. సంబంధిత అధికారులకు సమస్య విన్నవించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా ఎవరూ ప్రయత్నం చేయలేదు. రెండురోజుల క్రితం ఇదే భవనం పక్కన గల ఎస్సీ హాస్టల్ నుంచి బోరు నీటిని సరఫరా చేశారు. ఈ క్రమంలో మోటారు కాలిపోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. కస్తూర్బాలో నెలకొన్న దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్ మంగోలు చంటికి వివరించడంతో వారు వెంటనే స్పందించి వాట ర్‌ట్యాంకర్‌ను పంపించారు. అయితే ఆ నీటిని విద్యార్థినులే తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది.



మునిసిపల్ కమిషనర్, కౌన్సిలర్ చొరవతో పాఠశాలకు పంపించిన వాటర్ ట్యాంకర్

వంతులవారీగా స్నానాలు చేస్తున్నది వాస్తవమే

నీటికొరత వల్ల విద్యార్థినులు వంతులవారీగా స్నానాలు చేస్తున్నది వాస్తవమే. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పిస్తే ట్యాంక్‌కు మళ్లించే అవకాశం లేదు. దీంతో విద్యార్థినులతో మోయించాల్సి వస్తుంది. అందుకనే ట్యాంకర్‌ను తెప్పించలేదు.

- కృష్ణవేణి కస్తూర్బా ప్రత్యేకాధికారి



చేర్యాలలో పట్టుబడ్డ గంజాయి చాక్లెట్లు

గంజాయి చాక్లెట్ల కలకలం

7వ పే.

- చేర్యాలలో కళాశాల పక్కనున్న పాన్‌షాపులో విక్రయం
- 6 కిలోల పరిమాణం గల 1200 గంజాయి చాకెట్లు పట్టివేత
- విక్రయదారుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- హుస్నాబాద్‌లో కిలోన్నర గంజాయి, గంజాయి చాక్లెట్లు స్వాధీనం



నైతిక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు నైతిక్

దుబ్బాక, జనవరి 31: రాష్ట్రస్థాయి అబాకస్(స్పీడ్‌మ్యాస్) పోటీలకు సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని సరస్వతీ గ్లోబల్ పాఠశాల విద్యార్థి నైతిక్ ఎంపికయ్యాడు. సిద్దిపేటలో జిల్లాస్థాయి అబాకస్ (స్పీడ్‌మ్యాస్) పోటీల్లో సత్తాచాటాడని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. బుధవారం ఆయన పాఠశాలలో మాట్లాడారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే అబాకస్ పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హేమచంద్ర ఎంపిక

● విద్యార్థిని అభినందించిన సర్పంచ్, హెచ్‌ఎం

చేర్యాల, జనవరి 31: చేర్యాల మండలం ముస్త్యాల జడ్పీఎస్ఎస్ 8వ తరగతి విద్యార్థి పి.హేమచంద్ర జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 38వ తెలంగాణ సబ్ జూనియర్స్ ఎంపిక పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతో ఫిబ్రవరి 7 నుంచి 11వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం చిత్తరుగర్డ్‌లో జరగబోయే జాతీయ పోటీలకు తెలంగాణ జట్టు తరఫున పాల్గొనను న్నాడు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి, హెచ్‌ఎం పద్మలత, ఎస్ఎంసీ చైర్మన్ విజయ్ తదితరులు హేమచంద్రతోపాటు పీఈటీ కొండయ్యను అభినందించారు.

బస్వాపూర్‌లో ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

కోహెడ, జనవరి 31: కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన ప్రతి డీలర్ 10 టన్నుల యూరియాకు తగ్గకుండా స్టాక్ చూసుకోవాలన్నారు. ప్రతి డీలర్ పీవోఎస్ మెషీన్ ద్వారానే అమ్మకాలు జరపాలన్నారు. స్టాక్ బుక్, బిల్ బుక్ ప్రతి షాప్‌లో కలిగి ఉండాలని చెప్పారు. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతీ రైతు తప్పకుండా బిల్ రశీదు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర్, విస్తరణ అధికారి కీర్తన ఉన్నారు.

పంటల వివరాలు తప్పకుండా నమోదు చేయించుకోవాలి

వర్గల్, జనవరి 31: రైతులు సాగుచేసిన పంటల వివరాలను వ్యవసాయాధికారులకు తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండలం తునికిమక్తా గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసిన పంటల వివరాలను పరిశీలించి మాట్లాడారు. పంట నమోదు ప్రక్రియను వ్యవసాయ విస్తరణ అధికారులు వేగవంతం చేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శేషశయిని, విస్తరణ అధికారి ధర్మేందర్ పాల్గొన్నారు.

శనగ సాగులో విప్లవం..
నంద్యాల గ్రామ్-119

నంద్యాల టౌన్, జనవరి 31: నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆవిష్కరించిన నంద్యాల గ్రామ్ (ఎన్‌బీఈజీ)-119 రకం శనగ రైతుల ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. 2015లో నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి విడుదలైన నంద్యాల గ్రామ్-119 అత్యధిక విస్తీర్ణంలో సాగవుతోంది. ప్రకాశం జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణంలో 40 వేల హెక్టార్లల్లో నంద్యాల గ్రామ్ 119 సాగు చేస్తున్నారు. ఎకరానికి 10-12 క్వింటాళ్ల దిగుబడి ఇస్తూ.. స్వల్పకాలిక రకం కావడంతో రాయలసీమ జిల్లాల్లో సైతం ఈ రకం సాగు అధికంగా ఉంది. చీడ, పీడలను తట్టుకునే సామర్థ్యం, తక్కువ కాలంలో పంట వచ్చే నంద్యాల గ్రామ్-119 మున్ముందు మరింత విస్తృత స్థాయిలో సాగయ్యే అవకాశం ఉన్నట్లు నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శనగ ప్రధాన శాస్త్రవేత్త వి.జయలక్ష్మి చెప్పారు. 95 రోజుల స్వల్పకాలిక కాబూలి శనగ రకం, 100 గింజల బరువు 38-40 గ్రాములు, గింజ లావుగా, ఆకర్షణీయంగా ఉంటుందని తెలిపారు. హెక్టారుకు వర్షాధారంలో 17.5-20 క్వింటాళ్లు, 1 లేదా 2 తడులతో 20-25 క్వింటాళ్ల దిగుబడితో ఎండు తెగులును తట్టుకునే శక్తి ఈ రకానికి ఉందన్నారు.

పదవ తరగతి పరీక్షల్లో మార్పు

● సైన్స్ సబ్జెక్టులకు వేర్వేరుగా పరీక్షలు

చిన్నకోడూరు, జనవరి 31: పదవ తరగతి పరీక్షల షెడ్యూలులో ప్రభుత్వం ఈసారి స్వల్ప మార్పులు చేసింది. గతంలో ప్రతీ పరీక్షను ఒక్కో రోజు నిర్వహించగా ఈసారి ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను రెండు వేర్వేరు రోజుల్లో నిర్వహించనుంది. మిగతా సబ్జెక్టుల 100 మార్కులకు (ఇంటర్నల్ 20 మార్కులు కలుపుకుని) పరీక్ష నిర్వహిస్తుండగా, సైన్స్ సబ్జెక్టులను రెండు పరీక్షలుగా విభజించి ఒక్కో పరీక్ష 50 మార్కులకు (ఇంటర్నల్ 10 మార్కులు కలుపుకొని) నిర్వహించనుంది. ఈ నూతన విధానంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గనుంది.

రెండేళ్లుగా ఒకే పరీక్ష

గత రెండు సంవత్సరాలుగా ఈ రెండు పేపర్లకు ఒకే పరీక్షగా, ఒకే రోజున నిర్వహించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సాంఘిక శాస్త్ర సబ్జెక్టులను ఒక్కొక్క ఉపాధ్యాయుడు బోధిస్తుండగా సైన్స్ సబ్జెక్టులైన ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టులను వేర్వేరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. దీంతో పరీక్షలు వేర్వేరుగా ఉండాలనే వినతులు రాగా రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఒక్కో పరీక్షకు 50 మార్కులకు చొప్పున రెండు పరీక్షలను నిర్వహించనున్నారు. కరోనా కంటే ముందు హిందీ సబ్జెక్టు మినహా మిగతా అన్ని సబ్జెక్టులకు రెండు వేర్వేరు పరీక్షలు 50 మార్కుల చొప్పున నిర్వహించేవారు. కరోనా అనంతరం అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్షగా రెండేళ్లుగా నిర్వహిస్తున్నారు. కాగా ఈసారి భిన్నంగా మిగతా అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్షను ఫిజికల్, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు మాత్రం ప్రత్యేకంగా వేర్వేరు రోజుల్లో పరీక్ష నిర్వహించడానికి టైం టేబుల్ విడుదలైంది. మార్చి 18 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా ఫిజికల్ సైన్స్ పరీక్ష మార్చి 26న, బయోలాజికల్ సైన్స్ పరీక్ష 28న జరగనుంది.


పదవతరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

నగలు దోచుకునేందుకే
కొల్గూరులో మహిళ హత్య

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

గజ్వేల్, జనవరి 31: ఈ నెల 26న కలకలం రేపిన గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన మహిళ హత్య కేసును గజ్వేల్ పోలీసులు ఛేదించారు. గజ్వేల్ సీఐ బి.సైదా బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణానికి చెందిన సుంకరి భాను(30)కు అహ్మదీపూర్ గ్రామానికి చెందిన శ్యామలతో 2017లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భాను అనేక వ్యాపారాలు చేసినా నష్టం వాటిల్లడంతో అప్పులు పెరిగిపోయాయి. వాటిని తీర్చే మార్గం లేక మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ 11వ వార్డు కౌన్సిలర్ గంగిశెట్టి చందన-రవిందర్ ఇంట్లో బెదిరింపు లేఖను వదిలాడు. ఈ విషయంలో సైతం కేసు నమోదైంది. అనంతరం ప్రతీరోజు సాయంత్రం కల్లు తాగేందుకు అలవాటుపడిన భాను.. కొల్గూరులోని ఓ కిరాణ దుకాణ యజమాని చెన్న శ్యామల(52)తో పరిచయం పెంచుకున్నాడు. ఆమె ఇంట్లో శ్యామల, ఆమె భర్త శ్రీనివాస్ ఇద్దరే ఉంటారని గమనించాడు. శ్యామల మెడలోని బంగారాన్ని దోచుకోవాలనే ఉద్దేశంతో ఈ నెల 26న ఉదయం ఆమె బాత్‌రూంకు వెళ్లగా భాను ఇంట్లోకి చొరబడి దుకాణంలోని నగదును దొంగలించాడు. అనంతరం బాత్‌రూం నుంచి తిరిగి వస్తున్న శ్యామల ముఖాన్ని దిండుతో అదిమిపట్టడంతో మృతిచెందింది. వెంటనే ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలను దోచుకుని వెళ్లాడు. ఈ కేసు విషయమై సీపీ అనురాధ ఆదేశాల మేరకు గజ్వేల్ ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, దర్యాప్తు చేపట్టారు. బుధవారం భానును పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. భాను నుంచి మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు, కమ్మలు, రూ.54వేల నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ సైదా తెలిపారు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర వహించిన గజ్వేల్ ఏసీపీ రమేశ్, సీఐ సైదా, ఎస్ఐ పరశురాం, తొగుట హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, గజ్వేల్ క్రైమ్ కానిస్టేబుళ్లు నవీన్, రామోళ్ల వెంకటేశ్, నరేందర్, రవిలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు.

పురుగుల మందు చెవిలో పోసుకొని ఆత్మహత్య

అక్కన్నపేట, జనవరి 31: అన్నదమ్ముల మధ్య భూ తగాదాలతో మనస్తాపం చెందిన వ్యక్తి పురుగుల మందు చెవిలో పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన జిల్లెల్ల నారాయణరెడ్డి(75)కి ఆయన సోదరుడికి మధ్య భూ తగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం వారి మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపం చెందిన నారాయణరెడ్డి మంగళవారం రాత్రి ఇంట్లోని పురుగుల మందును చెవిలో పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపారు.


నారాయణరెడ్డి (ఫైల్)

ఈవీఎంలు సిద్ధం చేయండి

● రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి లోకేష్‌కుమార్

మెదక్ అర్బన్, జనవరి 31: పార్లమెంట్ ఎన్నికలు రానున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం ఈవీఎంల ఏర్పాట్లను పూర్తి చేయాలని రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి లోకేష్‌కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అవసరమైన ఈవీఎంలను, వీవీప్యాట్‌లను కేటాయించాలన్నారు. ఇందుకు సిబ్బంది కేటాయింపు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈవీఎంలలో సమస్యలు ఉంటే ఈసీఐ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. జిల్లాలో ఈవీఎం, వీవీ ప్యాట్ల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

గంజాయి చాక్లెట్ల కలకలం

● చేర్యాలలో కళాశాల పక్కనున్న పాన్‌షాపులో విక్రయం
● 1,200 గంజాయి చాకెట్లు పట్టివేత
● విక్రయదారుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

చేర్యాల, జనవరి 31: సిద్దిపేట జిల్లా చేర్యాల ఆర్టీసీ బస్టాండు, కళాశాల సమీపంలోని ఓ పాన్‌షాప్ నిర్వాహకుడు గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తుండటం కలకలం రేపింది. సదరు షాపులో గంజాయి చాక్లెట్లను ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టుకుని నిర్వాహకుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఎక్సైజ్ సీఐ మహేంద్రకుమార్ వివరాలను వెల్లడించారు. బీహార్‌కు చెందిన రాకేశ్‌కుమార్ కొంతకాలంగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ హోటల్ ఆవరణలో పాన్‌షాపును నిర్వహిస్తున్నాడు. బీహార్ నుంచి గంజాయి చాకెట్లు అతి తక్కువ ధరకు తీసుకొచ్చి స్థానికంగా పనులు చేసుకుంటున్న బీహార్ కూలీలు, ఇతరులకు విక్రయిస్తున్నాడు. ఒక్కో చాక్లెట్‌లో 13 శాతం గంజాయి ఉంటుంది. నమ్మదగిన సమాచారం రావడంతో బుధవారం పోలీసులు దాడులు చేపట్టగా 30 ప్యాకెట్లు పట్టుబడ్డాయి. ఒక్కో ప్యాకెట్‌లో 40 చాక్లెట్లు ఉండగా మొత్తం 6 కిలోల పరిమాణం గల 1200 చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందన్నారు. నిర్వాహకుడు రాకేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వినోద్ కుమార్, సురేశ్ పాల్గొన్నారు.


చేర్యాల పట్టణంలో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

హత్నూరలో..

హత్నూర: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మల్కాపూర్‌లో బుధవారం ఎండు గంజాయి, మత్తు చాక్లెట్లలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం గత కొంత కాలంగా హత్నూర మండలం మల్కాపూర్ గ్రామ శివారులో గల ఓ వ్యవసాయ క్షేత్రంలో నివాసముంటున్నారు. సమీప ప్రాంతంలోని పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు గంజాయి, మత్తు చాక్లెట్లు విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందడంతో బుధవారం పోలీసులు దాడి చేసి, కిలోన్నర ఎండు గంజాయితో పాటు మత్తు పదార్థాలు కలిపి తయారు చేసిన చాక్లెట్లలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


హత్నూరలో గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు


మహిళా డిగ్రీ కళాశాలకు రక్షణ కల్పించండి

సంగారెడ్డి రూరల్, జనవరి 31: సంగారెడ్డి పట్టణంలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశంకు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రహరీని కొందరు వ్యక్తులు ధ్వంసం చేసి లోనికి ప్రవేశిస్తుండడంతో విద్యార్థినులు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. కళాశాల ఆవరణలో ప్రహరీని నిర్మించి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. బయటి వ్యక్తులు అక్రమంగా లోనికి రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో రవికిరణ్‌గౌడ్, వాణి తదితరులు ఉన్నారు.


ఏవో పరమేశంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు







చట్టసభలకు వెళ్లకుండా కోదండరాంపై కేసీఆర్ కుట్ర

● టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి
● సంగారెడ్డిలో మాజీ సీఎం దిష్టిబొమ్మ దహనం

సంగారెడ్డి అర్బన్, జనవరి 31: చట్టసభలకు వెళ్లకుండా కోదండరాంపై మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ కుట్ర పన్నిందని తెలంగాణ జన సమితి(టీజేఎస్) జిల్లా అధ్యక్షుడు పాతదొడ్డి తుల్జారెడ్డి ఆరోపించారు. సంగారెడ్డిలోని ఐబీ వద్ద టీజేఎస్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా తుల్జారెడ్డి మాట్లాడుతూ.. టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాంను గౌరవించి కాంగ్రెస్ పార్టీ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమిస్తే ప్రమాణ స్వీకారం చేయకుండా కోర్టుకెళ్లి అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినా బీఆర్ఎస్‌కు సిగ్గు రావడం లేదని, ఇలాంటి కుట్రలు సమాజానికి శ్రేయస్కరం కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ ప్రధాన కార్యదర్శి సాయిలు, నాయకులు శ్రీధర్‌మహేంద్ర, విష్ణువర్ధన్‌రెడ్డి, శశికాంత్, రాంరెడ్డి పాల్గొన్నారు.


కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న టీజేఎస్ నాయకులు

ఉత్సాహంగా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

● రాష్ట్రస్థాయికి 25మంది క్రీడాకారుల ఎంపిక

మెదక్ అర్బన్, జనవరి 31: మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ మైదానంలో 9వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-8, 10, 12, 14 బాల బాలికలకు రన్నింగ్, త్రో, జంపింగ్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 25 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఫిబ్రవరిలో కొత్తగూడెం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సుభాస్‌చంద్రబోస్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్, కోచ్ పృథ్వీ, సుమన్, పీఈటీలు మమత, చంటీ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో నారాయణపూర్‌కు ప్రథమ బహుమతి

నర్సాపూర్: మెదక్‌లో నిర్వహించిన సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని నారాయణపూర్ పాఠశాల విద్యార్థులు పరుగు పందెంలో ప్రథమ బహుమతి పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు ఎల్.శ్రీనివాస్‌జాదవ్ తెలిపారు. పి.వరునిక 300మీటర్లు, 50మీటర్ల పరుగుపందెంలో ప్రథమ బహుమతి పొందినట్లు చెప్పారు. బ్రాడ్ జంప్‌లో పి.లాస్య ప్రథమ స్థానం పొందినట్లు చెప్పారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనందు పాఠశాల తరుపున ప్రత్యేకంగా అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఉపాధి హామీ పనులపై ప్రజాదర్బార్

చిన్నశంకరంపేట, జనవరి 31: చిన్నశంకరంపేట మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డీఆర్డీవో పీడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ, ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.6కోట్ల 50 లక్షల పనులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతలను, మరుగుదొడ్ల నిర్మాణాల విషయంలో గ్రామపంచాయతీల్లో అవకతవకలు జరిగినట్లు వివరించారు. డీఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి రూ.1500 జరిమానా, రూ.లక్షా 20వేలు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ విరోజ, ఎంపీడీవో ప్రవీణ్, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, క్యూసీ దేవేందర్, ఏసీవో వెంకటసాయిగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండలాధ్యక్షుడు నాగభూషనం, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలం

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు,

నారాయణఖేడ్, జనవరి 31: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, జిల్లా మాజీ అధ్యక్షుడు మాణిక్యం విమర్శించారు. బుధవారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నామన్నారు. సమ్మెను జయప్రదం చేయడానికి అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. కేంద్రంలోని మోదీ సర్కార్‌ను గద్దె దించినప్పుడే అన్ని వర్గాల వారికి మంచి రోజుల వస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల యూనియన్ నాయకులు నాగేశ్వరి, అనురాధ, స్వరూప, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

రైతునేస్తంగా 'సుష్మ' ప్రయోగం

● దక్షిణ భారత విజ్ఞాన సదస్సులో ప్రదర్శన

జగదేవ్‌పూర్, జనవరి 31: సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుష్మ తయారు చేసిన పరికరం రైతునేస్తంగా మారింది. 2023 రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి జిల్లాస్థాయి పోటీల్లో సుష్మ తయారు చేసిన పరికరం జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఎంపికై దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరుగుతున్న దక్షిణ భారతదేశస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శిస్తున్నారు. మూడు చక్రాలతో కూడిన ఒక వాహనంపై 25 లీటర్ల ఖాళీ క్యాన్‌ను బిగించారు. ఈ ఖాళీ క్యాన్‌లో ఎరువును నింపి పంట చేనుకు ఇరువైపులా ఎరువులు చల్లేలా తీర్చిదిద్దింది. ఈ ప్రయోగం ద్వారా ఒకేసారి రెండు వరుసల్లో ఎరువు వేసే విధంగా పరికరాన్ని రూపొందించారు. ఈ పరికరం రైతు నేస్తంగా ఉండడంతో పాటు బహుళ ప్రయోజనం అందించనున్నది. పాఠశాల ఫిజికల్ ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య గైడ్‌గా ఉండి పరికరాన్ని తీర్చిదిద్దారు.


సుష్మ తయారు చేసిన పరికరం


వైజ్ఞానిక ప్రదర్శనలో పరికరం విధానాన్ని వివరిస్తున్న సుష్మ

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి: రోజాశర్మ



చంద్లాపూర్‌లో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి

చిన్నకోడూరు, జనవరి 31: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మండలంలోని చంద్లాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులను బుధవారం ఆమె ఎంపీపీ మాణిక్యరెడ్డితో కలిసి ప్రారంభించారు. అంతకుముందు గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రంగనాయకసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన గ్రామ రైతుల త్యాగం గొప్పదన్నారు. చంద్లాపూర్‌కు జాతీయస్థాయిలో బెస్ట్ టూరిజం విలేజ్ అవార్డు రావడం సంతోషకరమన్నారు. చంద్లాపూర్ గ్రామ, చిన్నకోడూరు మండల అభివృద్ధికి కృషిచేసిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలోని రైతువేదికలో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ముగింపునకు హాజరై మాట్లాడారు. అంతకు ముందు గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యుల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా శాలువాతో సన్మానించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ దుర్గారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు ఉమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ పుష్పలత, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి



రాయపోల్‌లో సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ అనిత



చేర్యాల: పదవీకాలం ముగిసిన సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ కీర్తన, జడ్పీటీసీ సిద్ధప్ప

గ్రామాల్లో సర్పంచుల సేవలు మరువలేనివి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- సర్పంచులకు ఘనంగా వీడ్కోలు

దుబ్బాక, జనవరి 31: గ్రామాల్లో సర్పంచుల సేవలు మరువలేనివని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్పంచుల పదవీకాలం నేటితో పూర్తవుతున్నదన్నారు. రాష్ట్రంలో పల్లెలు ప్రగతిపథంలో నడవడానికి సర్పంచులే కీలకమని తెలిపారు. అలాగే దుబ్బాకలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పుష్పలత ఆధ్వర్యంలో సర్పంచులకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి సన్మానించారు. జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు మాధవి, బాణాల శ్రీనివాస్, సర్పంచులు తదితరులున్నారు.

●**కోహెడ:** మండలంలోని 27 గ్రామపచాయతీలలో సర్పంచులకు కార్యదర్శులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులందరికీ గ్రామ పెద్దలు, ఎంపీటీసీలు శాలువాలతో సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, ఎంపీటీసీలు, గ్రామస్థులు ఉన్నారు.

●**కొండపాక:** ప్రజాప్రతినిధులుగా ప్రజాసేవ చేసేవారికి రిటైర్మెంట్ ఉండదని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాంరెడ్డి అన్నారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామపంచాయతీ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్ గౌడ్ తన పదవీకాలం ముగిసిన సందర్భంగా పాలకవర్గాన్ని, సిబ్బందిని, అధికారులను సత్కరించారు. ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మంచాల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్ ఉన్నారు.

●**చేర్యాల:** గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు అందించిన సేవలు ఎనలేనివని కొమురవెల్లి ఎంపీపీ తలారి కీర్తన అన్నారు. కొమురవెల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం కొమురవెల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కీర్తన అధ్యక్షతన జరిగింది. పలు అంశాల పై చర్చించిన అనంతరం సర్పంచులను ఘనంగా సత్కరించారు. జడ్పీటీసీ సిలివేరు సిద్ధప్ప, ఎంపీడీవో అనురాధ, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**హుస్నాబాద్‌రూరల్:** హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామపంచాయతీ సర్పంచ్ తొడేటి రమేష్, ఉపసర్పంచ్, పాలకవర్గాన్ని మహిళా సంఘాల ప్రతినిధులు సన్మానించారు.

●**మద్దూరు:** ప్రజల భాగస్వామ్యం, పాలకవర్గం సహకారంతోనే గ్రామాల అభివృద్ధికి కృషిచేసినట్లు దూళిమిట్ట సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం దూళిమిట్ట గ్రామపంచాయతీలో ప్రజల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాలతో పాటు గ్రామస్థులు సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గాన్ని సన్మానించారు. మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మ, మాజీ సర్పంచులు నాచగోని పద్మ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు.. డాక్టర్‌కు గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

గజ్వేల్, జనవరి 31: కరీంనగర్‌లో పీజీ డాక్టర్‌గా విధులు ముగించుకుని తన కారులో హైదరాబాద్‌కు వెళ్తున్న డాక్టర్ శివ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శివకు తీవ్రగాయాలు కాగా, చుట్టుపక్కల వారు గమనించి వెంటనే 108కి ఫోన్‌చేశారు. 108 అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్, నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందిస్తూ గజ్వేల్ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

అక్కన్నపేట, జనవరి 31: అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన ఎగ్గిడి ధనలక్ష్మి ఇంటి వద్దకు వచ్చి అసభ్య పదజాలంతో దూషిస్తూ చంపుతానని బెదిరించిన ఇదే గ్రామానికి చెందిన ఎగ్గిడి ఐలయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర వివేక్ బుధవారం తెలిపారు. కొద్దిరోజులుగా ధనలక్ష్మి, ఐలయ్య కుటుంబాల మధ్య భూ తగాదాలు నడుస్తున్నాయని, అవి మనసులో పెట్టుకొని గొడవ జరిగినట్లు ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

హుస్నాబాద్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- మూడు తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరణ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్ఐ మహేష్

హుస్నాబాద్‌రూరల్, జనవరి 31: హుస్నాబాద్‌లో చోరీ జరిగింది. పట్టణంలోని శివాలయం వీధిలోని దామిడి శంకర్‌రెడ్డి ఇంట్లో వంగర రాజిరెడ్డి అద్దెకు ఉంటున్నాడు. మూడురోజుల క్రితం ఇంటికి తాళం వేసి భార్యాభర్తలు కోహెడ మండలం సముద్రాలకు వెళ్లారు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును అపహరించుకుపోయారు. బుధవారం సాయంత్రం రాజిరెడ్డి రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు ఆభరణాలు, నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మహేష్ ఘటనా స్థలానికి చేరుకుని, క్లూస్‌టీంను రప్పించి పంచనామా నిర్వహించి, దుండగుల కోసం గాలిస్తున్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ పనులు ప్రారంభం

చేర్యాల, జనవరి 31: చేర్యాల పట్టణంలోని 11వ వార్డు పరిధిలోని జెండాగల్లిలో పట్టణ ప్రగతి నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ పనులను బుధవారం మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, కౌన్సిలర్ ముస్త్యాల తారతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేర్యాల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పాటు పడుతున్నామని పేర్కొన్నారు. మునిసిపల్ కమిషనర్ జీ.రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, సందుల సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయంగా తగిన గుర్తింపు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు


సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 31: తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న బీసీలకు రాజకీయంగా తగిన గుర్తింపు ఇవ్వాలని బీసీ సంఘం నాయకులు ప్రశాంత్, నవీన్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో అన్ని రాజకీయ పార్టీల బీసీ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు పెద్దపీట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంకటి నవీన్‌గౌడ్, పడిగే ప్రశాంత్, పవన్‌కుమార్, సంతోష్, భార్గవ్, అరుణ్ పాల్గొన్నారు.

కూడవెల్లి వాగులోకి మల్లన్నసాగర్ నీటిని విడుదల చేయాలి

- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్, జనవరి 31: గజ్వేల్ మండలంతో పాటు దుబ్బాక, సిరిసిల్ల నియోజకవర్గాలకు వర ప్రదాయనీ అయిన కూడవెల్లి వాగులోకి మల్లన్నసాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూడవెల్లి పరీవాహక ప్రాంతం పొడవునా వేలాది ఎకరాల్లో వేసిన వరి పంట ఎండిపోతుందని చెప్పారు. ప్రస్తుతం నీళ్లు వదలాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ ద్వారా కోరామని, కానీ ఇప్పటివరకు అనుమతి రాలేదని తెలిపారు. అధికారులు, మంత్రులు చొరవ చూపి నీటిని విడుదల చేయాలని లేనిపక్షంలో రైతాంగం పక్షాన పోరాడుతామని హెచ్చరించారు.

ప్రారంభానికి ముందే గాంధీ విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన గాంధీ విగ్రహం

అక్కన్నపేట, జనవరి 31: అక్కన్నపేట మండలంలోని మంచినీళ్లబండ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ప్రారంభానికి ముందే గుర్తుతెలియని దుండగులు చేతులు, చెవులు విరగొట్టి ముఖాన్ని ధ్వంసం చేశారు. ఓ ప్రజాప్రతినిధి మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. అయితే విగ్రహాన్ని ధ్వంసం చేయడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ఆకతాయిల పనిగా ఉపాధ్యాయులుగా పేర్కొంటున్నారు. గాంధీ విగ్రహానికి మరమ్మతులు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

గజ్వేల్ రూరల్ సీఐగా మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



సీపీ అనురాధకు పూల మొక్కను అందజేస్తున్న గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్, జనవరి 31: వర్గల్ మండలం గౌరారంలో గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో బాన్సువాడ రూరల్ సర్కిల్ నుంచి వచ్చిన మహేందర్‌రెడ్డి గజ్వేల్ రూరల్ సీఐగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సీపీ అనురాధ సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిన బిజివెంకటాపూర్ సర్పంచ్

జగదేవ్‌పూర్, జనవరి 31: మండలంలోని బిజివెంకటాపూర్ సర్పంచ్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు బుధవారం డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి నర్సారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు మహేష్, మహేందర్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, వెంకట్, బాబు పాల్గొన్నారు.

కోదండరాంపై నీచ రాజకీయాలు మానుకోవాలి

- తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు నిరుడి స్వామి

గజ్వేల్, జవవరి 31: తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాంపై నీచ రాజకీయాలను మానుకోవాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు నిరుడి స్వామి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన కోదండరాం ప్రమాణ స్వీకారానికి అడ్డుపడుతూ కుట్రలో భాగంగా కోర్టులో కేసు వేసి ఉద్యమకారుడు అనే గౌరవం లేకుండా బీఆర్ఎస్ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఆయనపై చేస్తున్న కుట్రను తెలంగాణ సమాజం అంతా చూస్తున్నదని తెలిపారు.

ఎల్బీ స్టేడియానికి తరలిన స్టాఫ్‌నర్సులు

గజ్వేల్, జనవరి 31: కొత్తగా స్టాఫ్ నర్సులు(నర్సింగ్ ఆఫీసర్స్)గా నియామకమైన అభ్యర్థులు ఎల్బీ స్టేడియానికి తరలివెళ్లారు. సిద్దిపేట జిల్లా నుంచి కొత్తగా 264 మంది అభ్యర్థులు ఎంపిక కాగా.. వారిని ప్రత్యేక బస్సుల ద్వారా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎల్బీ స్టేడియానికి తరలించారు. వారికి నియామక పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతులమీదుగా అందజేశారు. త్వరలోనే వారికి వెబ్ ఆప్షన్లు ఇచ్చి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. కాగా జిల్లాలో ప్రజలకు వైద్య సేవలు చేరువకానున్నాయి.

ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన

మద్దూరు, జనవరి 31: మద్దూరు పోలీసుశాఖ ఆధ్వర్యంలో మండలంలోని రేబర్తి గ్రామంలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్‌అలీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీటీ గోపాల్, ఆర్ఐ రమేష్, ఏఎస్ఐ జగదీశ్వర్‌తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

కొండపాక, జనవరి 31: కొండపాక గ్రామానికి చెందిన ఏర్పుల నర్సవ్వ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ చిట్టి మాధురిదేవేందర్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

అంగన్‌వాడీ కార్మికుల సమ్మె నోటీస్

మిరుదొడ్డి, జనవరి 31: ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలందరూ పాల్గొంటారని బుధవారం దుబ్బాకలోని సీడీపీవోకు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెనోటీస్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులున్నారు.

సమాజ సేవతో మానసిక సంతృప్తి

కొండపాక, జనవరి 31: సమాజ సేవతో మానసిక సంతృప్తి కలుగుతుందని కొండపాక మండలం సిరిసినగండ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ద విఠల్ అన్నారు. క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాజుల శ్రీనివాస్ జ్ఞాపకార్థం సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలలోని పదో తరగతి చదువుతున్న 42 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను బుధవారం పంపిణీ చేశారు.

విద్యార్థులకు డిజిటల్ బుక్స్ పంపిణీ

సిద్దిపేట క్రైం, జనవరి 31: సిద్దిపేట పట్టణం పారుపల్లి హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాజీ మంత్రి హరీశ్‌రావు తన సొంత డబ్బులతో అందజేసిన డిజిటల్ కంటెంట్ బుక్స్‌ను బీఆర్ఎస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, యువజన విభాగం అధ్యక్షుడు రెడ్డి ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ ఇరుగంటి రమేష్ పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది: ఎంపీపీ

అక్కన్నపేట, జనవరి 31: గ్రామాల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని ఎంపీపీ మాలోతు లక్ష్మి-బీలు నాయక్ అన్నారు. బుధవారం అక్కన్నపేట మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఇందులో ఎంపీడీవో కొప్పుల సత్యపాల్ రెడ్డి, ఎంపీటీసీ పెసరు సాంబరాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



బెజ్జంకి మండల కేంద్రంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, జనవరి 31: అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో, గూడెం గ్రామంలో రూ.1.42 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టాయిలెట్స్, గ్రామపంచాయతీ భవన సముదాయాలు, ఊరచెరువు కట్ట సుందరీకరణ పనులు, కల్వర్టు నిర్మాణం, బాలుర పాఠశాలలో సైన్స్ ల్యాబ్, గర్ల్స్ హైస్కూల్లో కిచెన్‌షెడ్డు, ప్రహరీ, గూడెం గ్రామంలో ఓపెన్ జిమ్, యాదవ, ముదిరాజ్ సంఘం, గ్రామపంచాయతీ భవనం, సీసీరోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, జడ్పీటీసీ కవిత, సర్పంచులు మంజుల, రాజశ్రీ, ఎంపీటీసీ శారద, బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ సముదాయ భవనం, ఎంపీపీఎస్ పాఠశాల కాంపౌండ్, కిచెన్ షెడ్డు, టాయిలెట్స్‌కు చేపట్టిన పనుల ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంపై మంత్రి పొన్నం ప్రభాకర్ పేరు లేకపోవడంతో కాంగ్రెస్ నాయకులు ఇదేమిటని చర్చించుకున్నారు.

కాంగ్రెస్ పాలన వస్తే కేసీఆర్ చెప్పినట్లే విద్యుత్ కష్టాలు

- విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెల్వట్లే
- మండల సభలో ధ్వజమెత్తిన సర్పంచులు



తొగుట మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి

తొగుట, జనవరి 31: కాంగ్రెస్ పాలన వస్తే రాష్ట్రంలో కరెంట్ కష్టాలు వస్తాయని కేసీఆర్ చెప్పినట్లే జరుగుతుంది.. విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెల్వట్లే.. రైతులు ఎవుసం ఎట్లా చేయాలని మండల సభలో తుక్కాపూర్ సర్పంచ్, బీజేపీ మండలాధ్యక్షుడు చిక్కుడు చంద్రంముదిరాజ్ మండిపడ్డారు. బుధవారం తొగుట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గాంధారి లతానరేందర్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీపీ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. కరెంట్ విషయంలో విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రకటించి కేవలం 16 గంటలు కూడా రావడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నామని సమాధానమిచ్చారు. రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోవాలా అని సభ్యులు ప్రశ్నించారు. ఎంపీపీ స్పందిస్తూ విద్యుత్ సరఫరా విషయమై జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇంతవరకు డబ్బులు రాలేదని, ఈ రోజుతో తమ పదవీకాలం పూర్తవుతుందని, తాము చేసిన పనులు డబ్బులు ఇప్పించాలని సభ్యులు తెలిపారు. పెండింగ్ బిల్లును ఇప్పించేలా జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకుపోతామని ఎంపీపీ సూచించారు. వెంకట్రావ్‌పేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్మించిన డైనింగ్‌హాల్‌కు కాంట్రాక్టర్ తాళం వేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ కంకణాల నర్సింహులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీధర్, తహసీల్దార్ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమురయ్యలు సర్పంచులను శాలువాలతో సన్మానించారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

- పలు మండలాల్లో ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం



నారాయణరావుపేట: స్వయం పరిపాలనా దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

నారాయణరావుపేట/కొండపాక/వర్గల్/నంగునూరు, జనవరి 31: విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్డెపల్లి నాగరాజు అన్నారు. బుధవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కొండపాక మండలం కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం స్వయం పరిపాలనా దినోత్సవం జరుపుకున్నారు. పాఠశాలకు అన్నివిధాలుగా కృషిచేసిన సర్పంచ్ జయంతీనరేందర్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు. వర్గల్ మండలం నెంటూర్ విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ దేవి, కరస్పాండెంట్ దయాకర్, అధ్యాపకులు అభినందించారు. నంగునూరు మండలం రాజగోపాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు కనకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి'

జగదేవ్‌పూర్, జనవరి 31: మేజర్ గ్రామపంచాయతీ అయిన జగదేవ్‌పూర్ సర్పంచ్ లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి ఉపసర్పంచ్‌కు సమాచారం, సంతకం లేకుండానే లక్షల డబ్బులను కాజేశారని, వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని ఉపసర్పంచ్ మల్లేశం, వార్డుసభ్యుడు మహేష్ ఎంపీడీవో పట్టాభిరామారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ ఐదునెలలుగా సుమారుగా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు తమ సంతకం లేకుండానే బ్యాంకు నుంచి డబ్బులను డ్రా చేశారని ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

'సకాలంలో ట్రేడ్ లైసెన్స్ పొందాలి'

సిద్దిపేట టౌన్, జనవరి 31: సకాలంలో ట్రేడ్ లైసెన్స్ పొంది పట్టణ అభివృద్ధికి తోడ్పడగలరని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ బుధవారం పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ పరిధిలో వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ పొంది ఉండాలని చెప్పారు. లేకపోతే పురపాలక సంఘ చట్టం-2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గద్దర్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి

- పలు మండలాల్లో జయంతి



గజ్వేల్: అంబేద్కర్ చౌరస్తా వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్, జనవరి 31: గద్దర్ జీవిత చరిత్రను ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని గజ్వేల్ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గద్దర్ జయంతి సందర్భంగా గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు అటకూరి రాములు, మాల మహానాడు నాయకులు తుమ్మ శ్రీనివాస్ మాట్లాడారు. వారితో అంబేద్కర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిప్పల యాదగిరి, విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు బాల్‌నర్సయ్య ఉన్నారు.

●**హుస్నాబాద్‌రూరల్:** హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి కేడం లింగమూర్తి మాట్లాడారు. అనంతరం గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పచ్చిమట్ల రవీందర్, మారపల్లి సుధాకర్, ముక్కెర సంపత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●**జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్‌లోని మాలమహానాడు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాలమహానాడు మండలాధ్యక్షుడు శివలింగం మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

●**సిద్దిపేట అర్బన్:** గద్దర్ జయంతిని సిద్దిపేటలోని అంబేద్కర్ సర్కిల్‌లో దళిత సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాల నాయకులు జగన్, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కాంగ్రెస్, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న ఆలయ ఆవరణలో మెదక్ అదనపు ఎస్పీ మహేందర్

మల్లన్నను దర్శించుకున్న మెదక్ అదనపు ఎస్పీ

చేర్యాల, జనవరి 31: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని బుధవారం మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు స్వామివారం ప్రసాదం అందించి ఆశీర్వదించారు. బీఆర్ఎస్ నాయకుడు, షీప్స్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమట్ల బాలరాజు యాదవ్ గురువారం కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని కుటుంబసమేతంగా దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయనవెంట బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్, నాయకులు ఏర్పుల మహేశ్, బూరుగు స్వామి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నదే బీజేపీ లక్ష్యం

- మాజీ హౌజ్‌ఫెడ్ చైర్మన్, బీజేపీ హుస్నాబాద్ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరాంచక్రవర్తి

హుస్నాబాద్‌రూరల్, జనవరి 31: దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనే దేశ ప్రధాని నరేంద్రమోదీ అయోధ్యలో బాలరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారని మాజీ హౌజ్‌ఫెడ్ చైర్మన్, బీజేపీ హుస్నాబాద్ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరాంచక్రవర్తి పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలో శ్రీరాముని చిత్రపటాలను ఇంటింటికీ పంపిణీ చేసి మాట్లాడారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ శ్రీరాముడి చిత్రపటాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లక్కిరెడ్డి తిరుమల, వాసుదేవరెడ్డి, గుజ్జ సతీష్, లక్ష్మారెడ్డి, స్వరూప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరిలో మొగి పురుగు ఉధృతి



సిద్ధన్నపేటలో క్షేత్రస్థాయిలో రైతుల పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నంగునూరు, జనవరి 31: వరిలో మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నదని, రైతులు అప్రమత్తంగా ఉండాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి అన్నారు. బుధవారం నంగునూరు మండలం అంక్షాపూర్, ఖానాపూర్, నాగరాజుపల్లి, నంగునూరు, సిద్ధన్నపేట గ్రామాల్లో వ్యవసాయశాఖ, తోర్నాల పరిశోధన స్థానం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో మొగిపురుగు (కాండం తొలిచే పురుగు) ఉధృతి ఎక్కువగా ఉన్నదని, ఉధృతిని తగ్గించేందుకు చేపట్టాల్సిన నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల వ్యవసాయ అధికారి గీత, ఏఈవోలు శిరీష, సాయివర్మ, రైతులు పాల్గొన్నారు.